యథేచ్ఛగా మట్టి దందా!

- రాత్రీపగలు తేడా లేకుండా అక్రమ తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం
- రూ.లక్షలు దండుకుంటున్న అక్రమార్కులు



జూలూరుపాడులో ప్రభుత్వ భూమిలో తవ్వకాలు చేపట్టిన ప్రాంతం

జూలూరుపాడు: సహజ సంపదను కాపాడాల్సిన అధికారులే కళ్లున్న కబోధుల్లా వ్యవహరిస్తున్నారు. జేసీబీ, ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ల యజమానులు కుమ్మక్కై మట్టి దందా సాగిస్తున్నారు. వీరికి రాజకీయ పలుకుబడి కూడా తోడైంది. దీంతో జూలూరుపాడు మండలంలోని పలు గ్రామాల్లో గుట్టలు మాయమవుతున్నాయి. జూలూరుపాడు, గుండెపుడి, పడమటనర్సాపురం, వినోభానగర్, అనంతారం, పాపకొల్లు, కొమ్ముగూడెం, కరివారిగూడెం, భేతాళపాడు, కాకర్ల, మాచినేనిపేటతండా, మాచినేనిపేట, సురారం గ్రామ పంచాయతీల్లో జేసీబీ, ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ల యజమానులు యథేచ్ఛగా మట్టి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ, సీలింగ్, అసైన్డ్, అటవీ, ప్రైవేట్ భూములు, చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు, వాగులు, వంకల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు సాగిస్తూ రూ.లక్షలు దండుకుంటున్నారు.

జేసీబీ, ట్రాక్టర్ యజమానులు బ్రోకర్లను మధ్యవర్తులుగా పెట్టుకుని మట్టి కావల్సిన వారికి తరలిస్తున్నారు. ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.1,400 నుంచి రూ.1,800, టిప్పర్‌కు రూ.6,500 నుంచి రూ.8,000 వరకు తీసుకుంటున్నారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు...

జూలూరుపాడు, పడమటనర్సాపురం రెవెన్యూ గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. జూలూరుపాడులో 218 సర్వే నంబర్‌లో రెవెన్యూ అధికారులు వ్యవసాయ మార్కెట్ యార్డుకు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. ఇందులో మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రెవెన్యూ, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమ మట్టి వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగుతోంది. అదేవిధంగా పడమటనర్సాపురం గ్రామంలోని 162 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు జరుగుతుండటంతో గుట్టలు కనుమరుగవుతున్నాయి. అనుమతులు లేకుండా రాత్రివేళల్లో కొత్తగూడెం, సుజాతనగర్, వేపలగడ్డలలో ప్రభుత్వ పనుల ముసుగులో, వెంచర్లకు టిప్పర్లలో మట్టి తరలించి రూ.లక్షలు దండుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.

పట్టించుకోని అధికారులు...

అక్రమార్కులు మట్టి దందాను సాగించడానికి అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ అండదండలతో తవ్వకాలు కొనసాగిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. భూములపై అధికారుల అజమాయిషీ లేకపోవడంతో అక్రమార్కులకు కలిసి వచ్చిందంటున్నారు. దీంతో రాత్రి, పగలు అనే తేడా లేకుండానే బహిరంగానే మట్టి తోలకాలు కొనసాగిస్తున్నారు. గుట్టలు, ప్రభుత్వ, అటవీ భూముల్లోని మట్టి తరలిపోతోందని గ్రామస్తులు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

ప్రజా అవసరాల సాకుతో మట్టి తవ్వకాలు..

ప్రభుత్వం రోడ్లు, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుండటంతో అది సాకుగా చూపి అనుమతులు లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా గుట్టలు, ప్రభుత్వ, సీలింగ్, అటవీ భూములు, చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు, వాగులు, వంకల్లోనూ అక్రమార్కులు మట్టి తవ్వకాలు చేపడుతున్నారు.



పడమటనర్సాపురంలో మట్టి తరలిస్తున్న లారీ, జేసీబీని సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ మట్టి దందాకు అడ్డుకట్ట వేసి సహజ సంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

మైనింగ్‌శాఖ అనుమతులు తప్పనిసరి



ప్రభుత్వ భూముల్లో మట్టి తోలకాలకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. మైనింగ్‌శాఖ నుంచి తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలి. అక్రమ మట్టి తవ్వకాలపై దృష్టి సారిస్తున్నాం. ఇటీవల పడమటనర్సాపురంలో రెండు టిప్పర్లు, ఒక జేసీబీని సీజ్ చేసి, ఆయా యజమానులకు జరిమానా విధించాము.

– ఆర్.శారద, తహసీల్దార్, జూలూరుపాడు

క్లుప్తంగా

చైర్మన్‌కు ఎమ్మెల్యే అభినందన



డీవీని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు: అవిశ్వాసం అనంతరం చైర్మన్ పీఠం దక్కించుకున్న మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావును ఎమ్మెల్యే కోరం కనకయ్య అభినందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చైర్మన్‌ను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ నవీన్, మేనేజర్ అంకుషావలీ, కౌన్సిలర్లు వారా రవి, నవీన్, ఈశ్వర్, ఏఈ శంకర్ తదితరులు ఉన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన నాయకులు



భట్టిని కలిసిన సేవాలాల్ సేన నాయకులు

జూలూరుపాడు/టేకులపల్లి: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్కను బుధవారం వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలో సేవాలాల్ సేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఫిబ్రవరి 15న బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవుదినంగా ప్రకటించి, రాష్ట్ర వ్యాప్తంగా అధికారికంగా ప్రభుత్వమే నిర్వహించాలని భట్టి విక్రమార్కను కోరారు. ఈ కార్యక్రమంలో ధరావత్ సురేష్ నాయక్, బానోత్ నవీన్ రాథోడ్, బానోత్ నాగరాజు, ధరావత్ కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం

సుజాతనగర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భూక్యా విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధిపై ఎంపీటీసీలు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఆయా శాఖల అధికారులు నివేదికలు చదివి వినిపించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న డీఎస్పీ

కొత్తగూడెంటౌన్: విద్యార్థి సంఘాలు విద్యార్థులను చైతన్యపరిచే విధంగా ఉండాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం డీఎస్పీ కార్యాలయంలో ఏఐఎస్‌ఎఫ్ క్యాలెండర్లను డీఎస్పీ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... విద్యార్థులు, యువకులు మద్యం మత్తుకు బానిసలు కాకుండా అసంఘటిత కార్యక్రమాలలో పాల్గొనకుండా అఖిల భారత విద్యార్థి సమాఖ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీందాదా, జిల్లా నాయకులు హరీష్, గోవింద్, శ్రీను, ప్రతాప్, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేని నిర్మాణాలు

సుజాతనగర్: నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఆర్‌ఓబీ బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో వేపలగడ్డ సమీపంలో కుంగిన ఆర్వోబీని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వంతెన నిర్మాణం నాసిరకంగా ఉందని గతంలోనే ఆందోళన నిర్వహించినట్లు చెప్పారు. నాణ్యత లేకుండా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గర్హనీయం అన్నారు. నిత్యం వేలాది సంఖ్యలో వాహనాలు వెళ్లే ఇటువంటి పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వీర్ల రమేష్, కొండే కృష్ణ, నల్లగోపు పుల్లయ్య, గండమల్ల భాస్కర్, బాలు వెంకటేశ్వర్లు, చింతాల శ్రీను, చిలక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓసీకి అనుమతులు ఇప్పించండి..



మల్లు రవికి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో వీకే–7 ఓసీకి స్టేజ్–1కి అనుమతులు ఇప్పించాలని సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా బుధవారం యూనియన్ జనరల్ సెక్రటరీ అంతోటి నాగేశ్వరరావు ఆధ్వర్యాన ఢిల్లీలో రాష్ట్రప్రభుత్వ అధికార ప్రతినిధి మల్లు రవికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వీకే ఓసీకి అనుమతులు ఇప్పించడమేకాక ఇల్లెందు ఏరియాలోని రొంపేడు ఓసీ, కొత్తగూడెం ఏరియాలోని రాంపురం గనికి అటవీ అనుమతులు వచ్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంవీ రావు, జిమ్మిడి మల్లేష్, కాజీపేట కృష్ణ, ప్రవీణ్‌కుమార్, శనిగరపు కుమారస్వామి, బుర్గుల రామారావు, నక్క సుమన్, శ్రీనాథ్, మొగిలిపాక రవి, గజ్జి శ్రీనివాస్, వంగపండు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వితరణ



ఐరన్ ర్యాక్ అందజేస్తున్న సుమంత్

జూలూరుపాడు: గుండెపుడి అంగన్‌వాడీ కేంద్రానికి బుధవారం ఐరన్ ర్యాక్‌ను కాంగ్రెస్ జిల్లా యువజన నాయకుడు దుద్దుకూరు సుమంత్, అతని స్నేహితులు కలిసి వితరణ చేశారు. జూలూరుపాడు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు చేతులు మీదుగా ఐరన్ ర్యాక్‌ను అంగన్‌వాడీ టీచర్ సీతామహాలక్ష్మికి అప్పగించారు. వైస్ ఎంపీపీ గాదె నిర్మల, బానోత్ నరసింహారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, సెక్రటరీ హారిక పాల్గొన్నారు.

దాడి ఘటనపై ఫిర్యాదు

పాల్వంచరూరల్: మేకల కాపరిపై దాడి చేసిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. పాండురంగాపురం గ్రామంలో బుధవారం జక్కుల సురేష్ పంట చేనులో గొర్రెలను మేపుతున్న ముంత వెంకటేష్.. అదే చేనులోకి మేకలను తోలుకొచ్చిన ఎల్లావుల లింగయ్య మేకలను మేయకుండా అభ్యంతరం వ్యక్తం చేశాడు. వెంకటేష్ ముందుగా మేకలను బయటకు వెళ్లగొట్టడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. తనను రాయితోకొట్టి చంపుతానని బెదిరించాడని లింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

పల్లెల్లో సమస్యలపై ‘బీజేపీ’ ఆరా..



డీటీ గన్యా నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో అభియాన్ కార్యక్రమం ఇల్లెందులోని ఎల్‌బీఎస్ నగర్‌లో 83వ బూత్‌లో నిర్వహించారు. బీజేపీ ప్రభారీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు నూకల నారాయణరెడ్డి హాజరయ్యారు. బస్తీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను గమనించిన ఆయన ఏఈకి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. శాఖ గ్రంథాలయం పర్యవేక్షణ కొరవడటం, సమీపంలోని బాలికల హైస్కూల్‌లో మంచినీరు అందుబాటులో లేకపోవటం, సరిపడా టాయిలెట్స్ లేకపోవటాన్ని ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. మాట్లాడుతూ.. మూడేళ్లుగా పదో తరగతి విద్యార్థులకు ప్రయోగశాలలు అందుబాటులో లేకపోవటం వల్ల నష్టపోతున్నారని తెలిపారు. హైస్కూల్‌లో పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ మున్సిపాలిటీని ఉత్తమ మున్సిపాలిటీగా ఎలా గుర్తించారని ప్రశ్నించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బోడా సురేందర్ నాయక్, దోమల మహేశ్వర్, గోపీకృష్ణ, కొల్లి సంజీవరెడ్డి, శివకుమార్ ఖండేల్‌వాల్, రేవళ్ల నాగరాజు, శ్రీనివాస్, మావునూరి మాధవ్, రామయ్య, సుచిత్ర పాసీ, సునిత, సందీప్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం



పాల్వంచ: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



జూలూరుపాడు: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జూలూరుపాడు: సీఎం రేవంత్‌రెడ్డిపై చెన్నూరు బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జూలూరుపాడులో కాంగ్రెస్ శ్రేణులు నిరసన తెలిపారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి పాపకొల్లు క్రాస్ రోడ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి మాట్లాడుతూ.. సీఎంపై బాల్క సుమన్ తనస్థాయి మరిచి మాట్లాడుతున్నారని, తీరు మార్చుకోవాలని లేనిపక్షంలో ప్రజలు తగిన విధంగా బుద్ధి చెపుతారన్నారు. అధికారం కోల్పోవడంతో బీఆర్‌ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాలోత్ మంగీలాల్ నాయక్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, యల్లంకి చిన్న నాగేశ్వరరావు, రోకటి సురేష్, దుద్దుకూరి సుమంత్, వేల్పుల నరసింహారావు, నున్నా కృష్ణయ్య, పోతురాజు నాగరాజు, కొలిపాక వెంకటేశ్వరరావు, నర్వనేని పుల్లారావు, రామిశెట్టి నాగేశ్వరరావు, వందనపు సత్యనారాయణ, శాంతిలాల్, మల్లెల నాగేశ్వరరావు, కొమ్మినేని రాంబాబు, తోట శ్రీను, దాసరి నాగయ్య, వాంకుడోత్ కిషన్ నాయక్, ధర్మరాజుల వెంకటనారాయణ, బోడా భీమారావు, మిర్యాల కిరణ్ పాల్గొన్నారు.

పాల్వంచ: సీఎం రేవంత్‌రెడ్డిపై చెన్నూరు బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాల్క సుమన్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో బద్ది కిశోర్, చాంద్‌పాషా, సూర్యకిరణ్, మధు, శాంతివర్ధన్, ఉపేందర్, వీరూ నాయక్, దశరద్, గౌస్, చంద్రు, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ప్రణాళికలపై వివరణ



ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం, అధికారులు, నాయకులు

టేకులపల్లి: ఇల్లెందు ఏరియాలోని కోయగూడెం ఉపరితల గనిలో మల్టీ డిపార్ట్‌మెంటల్ టీమ్స్ నిర్వహణ కార్యక్రమం బుధవారం కేటీసీలో నిర్వహించారు. ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇల్లెందు ఏరియాలోని ఉద్యోగులందరికీ సింగరేణి సంస్థ ఉత్పత్తి మరియు ఉత్పాదకత, సింగరేణిలో వాడుకలో ఉన్న మిషనరీ పనితీరు, ఉత్పత్తి వ్యయం, ఇల్లందు ఏరియాలో కంపెనీ భవిష్యత్, ప్రణాళికలు, కార్మికులకు సంస్థ అందించిన సంక్షేమ కార్యక్రమాలు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి కార్యచరణ ప్రణాళికపై వివరించారు. యంత్రాల పని గంటలు పెంచాలని, సంస్థపై వినియోగదారుడు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి అందించాలని, ఎటువంటి ప్రమాదాలు లేకుండా సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు. అనంతరం ఉద్యోగుల నుంచి ఈ కార్యక్రమానికి సంబంధించిన సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, ఏజీఎం (ఐడీ) ఎం.గిరిధరరావు, ఏరియా ఇంజనీర్ నరసింహారాజు, డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, ఫైనాన్స్ మేనేజర్ మధుబాబు, కేటీసీ పీఓ ప్రహ్లాద్, గని మేనేజర్ రాజు, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ నజీర్ అహ్మద్, ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, అధికారులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.

మూడు విప్లవ పార్టీల విలీనం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సమసమాజ స్థాపన కోసం, నూతన ప్రజాతంత్ర విప్లవం, సోషలిజం కోసం ఏకీభావంగా మూడు విప్లవ పార్టీలైన సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్) ఆర్ఐ, పీసీసీ సీపీఐ(ఎంఎల్) పార్టీలు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్‌గా ఏర్పడాలని నిర్ణయించామని ఆపార్టీ జిల్లా కార్యదర్శి కెచ్చెర్ల రంగారెడ్డి, రాష్ట్ర నాయకులు గోకినపెల్లి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో ఖమ్మంలో మార్చి 3,4,5 తేదీలలో జరపతలపెట్టిన మహాసభల వాల్ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ సభల సందర్భంగా ఖమ్మం పట్టణంలో భారీ ప్రదర్శన, ర్యాలీ నిర్వహించనున్నామని, జిల్లా ప్రజానీకం, కార్మికవర్గం, రైతాంగం పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముద్దా భిక్షం, అమర్లపూడి రాము, జాటోత్ కృష్ణ, నూప భాస్కర్, సీవై పుల్లయ్య, మాచర్ల సత్యం, నూప సరోజ, పెద్దబోయిన సతీష్, ముత్యాలరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు



సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారికి సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశా వర్కర్లు

టేకులపల్లి: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘాల పిలుపు మేరకు ఫిబ్రవరి ఈనెల 16న గ్రామీణ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) పార్టీల ప్రజా సంఘాల సమావేశం రైతు కూలి సంఘం జిల్లా నాయకులు భూక్యా హర్జ్యా నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్‌కేఎం టేకులపల్లి మండల కన్వీనర్ బానోత్ ఉక్లానాయక్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు రామచందర్, సీపీఐ(ఎంఎల్) పార్టీ మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు, ప్రజాపంథా మండల కార్యదర్శి ధర్మపురి వీర బ్రహ్మాచారి, సీపీఎం మండల కార్యదర్శి ఈసం నరసింహారావు మాట్లాడుతూ.. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50శాతం కలిపి మద్దతు ధర ప్రకటించాలన్నారు. అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు మరియు పెన్షన్ రూ.పదివేలు ఇవ్వాలని కోరారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో అయిత శ్రీరాములు, నరసింహారావు, రామచందర్, సమ్మయ్య, ఎర్రయ్య, రాములక్క తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో...

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న దేశవ్యాప్త సమ్మె ,గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నేత అబ్దుల్ నబీ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దినేష్‌కు సమ్మె నోటీసు అందజేశారు. మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని, 29 చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా విభజించిందని, రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చిందని, వ్యవసాయ కూలీలు, ఉపాధి కూలీలకు బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు చేసిందని విమర్శించారు. అదానీ, అంబానీలకు కొమ్ముకాస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో కడుదుల వీరన్న, సీఐటీయూ నాయకులు మజహరి, జి.చైతన్య, బి.అరుణ, టి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫిల్టర్ బెడ్‌ను శుభ్రం చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): ఫిల్టర్‌బెడ్‌ను శుభ్రం చేసి కార్మిక కుటుంబాలకు మంచినీటిని విడుదల చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. బుధవారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని బర్లీఫాట్ ఫిల్టర్ బెడ్‌ను ఏఐటీయూసీ నాయకులు సందర్శించారు. చాంబర్, క్లోరినేషన్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ అంశాలపై డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ రవిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాయకులు మాట్లాడుతూ.. రాబోయే ఎండకాలంలో కాలనీ వాసులకు నీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. వంగా వెంకట్, జి.వీరస్వామి, ఎస్వీ రమణమూర్తి, రాములు, గట్టయ్య, నితిన్, క్రిష్టాఫర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పల్లెలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుదాం..

టేకులపల్లి: గ్రామాల్లో సమస్యల పరిష్కారం, పారిశుద్ధ్య నివారణకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు ఈనెల 15 వరకు నిర్వహించే ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం తొలిరోజు కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ప్రారంభించారు. కార్మికులు, అధికారులతో కలిసి చీపుర్లతో వీధులను శుభ్రం చేశారు. మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు, కార్యదర్శుల ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కోట వీరబాబు, కార్యదర్శి ఎల్.కిరణ్, ఎంపీటీసీ జాలాది అప్పారావు, సొసైటీ డైరెక్టర్ గుడిపూడి కృష్ణార్జున్‌రావు, మాజీ సర్పంచ్, వార్డు సభ్యులు, నాయకులు బోడ సరిత, మోహన్‌రావు, గుండా నరసింహారావు, బండ్ల శ్రీను, భద్రు, కాలె ప్రసాద్, సురేష్, నోముల భానుచందర్ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: పల్లెలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రతీఒక్కరు తమవంతు పాత్ర పోషించాలని ఎంపీడీఓ బాలరాజు సూచించారు. మండలంలోని పలు గ్రామపంచాయతీలలో బుధవారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామపంచాయతీలలో అధికారులు ప్రజాప్రతినిధులు, ప్రజలతో కలసి గ్రామాలలో ప్రదర్శన నిర్వహించారు. పలు వీధులలో పరిశుభ్రత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ చిరంజీవి, ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జూలూరుపాడు: మండలంలోని 24 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో బుధవారం పంచాయతీ ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. బుధవారం నుంచి ఈనెల 15 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు గాను పంచాయతీ ప్రత్యేక అధికారులు గ్రామసభలు నిర్వహించారు.

ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంపై ప్రత్యేక అధికారులు ప్రజలకు వివరించారు. గ్రామాల్లో చెత్తా చెదారం, పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, పిచ్చిమొక్కల తొలగింపు, ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయడం, సైడ్ కాల్వల్లో పూడిక తీత, రోడ్ల మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో శానిటేషన్, క్లోరినేషన్, పన్ను వసూళ్లు, రాబోయే వేసవికాలం దృష్ట్యా తాగునీటి సరఫరాపై దృష్టి సారించనున్నట్లు చెప్పారు. అనంతరం గ్రామాల్లో పర్యటించి, సమస్యలను గుర్తించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ప్రత్యేక అధికారులు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శారద, ఎంపీఓ తులసీరామ్, ఎఫ్ఆర్ఓ జి.ప్రసాద్‌రావు, విద్యుత్‌శాఖ ఏఈ సతీష్, ఏఓ ఎస్.రఘుదీపిక, పశువైద్యాధికారి బి.బద్దూలాల్, ఎంఈఓ వెంకట్, ఇరిగేషన్ ఏఈ మీనా, డిప్యూటీ తహసీల్దార్ గౌతమ్, పీహెచ్‌సీ సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: గ్రామపంచాయతీల్లో స్వచ్ఛతలో భాగంగా గురువారం సిబ్బంది స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. మండలంలోని 35 గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారులు గ్రామసభలు నిర్వహించి పారిశుద్ధ్య సేవలు చేట్టారు. తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు నిర్వహించారు. తోగ్గూడెంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మడవి సరస్వతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నీలావతి, కార్యదర్శి రవి పాల్గొన్నారు.



టేకులపల్లిలో రోడ్డును శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు



ఇల్లెందురూరల్: కొమ్ముగూడెంలో వీధులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాలరాజు



జూలూరుపాడు: భేతాళపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం